


ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఐక్యంగా ముందుకెళ్లాలి: సిఐటియు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సిఐటియు అనుబంధ సూళ్లూరుపేట మినీలారీ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ మీటింగ్ శనివారం జరిగింది. ఈ మీటింగుకు యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.పద్మనాభయ్య అధ్యక్షత వహించారు. తిరుపతి జిల్లా సిఐటియు అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి టి. మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులు సంఘటితంగా వుండి మంచి సర్వీసు ఇవ్వడమే కాకుండా, సమస్యలను తీర్చు కోవడములో ముందుండాలన్నారు. ఏ ప్రభుత్వము వున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా, అందుకు పోరాట బాట తీసుకొని పోరాడి సాధించుకోవాలని తెలిపారు. తిరుపతి జిల్లా కమిటీ నిరంతరం శ్రమజీవులకు అండగా వుంటామన్నారు. సిఐటియు మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్. సాంబశివయ్య, సి.హెచ్.సుధాకర్ రావు తదితరులు హాజరయ్యారు.

పెద్దల ఎన్నికల్లో బోగస్ ఓట్లు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజాస్వామ్యం తలదించుకునేలా బూర్జువా రాజకీయం తయారయ్యింది. అధికారం, పదవులే పరమావధిగా కుళ్లు రాజకీయ వ్యవస్థ రాజ్యమేలుతోంది. శాసనమండలి అంటే పెద్దల సభ. ఇక్కడ మేధావులు, పట్టభద్రులు, ఎంఎల్‌ఎలు, గవర్నర్, ప్రజాప్రతినిధుల కోటాలో ఎన్నికై ఈ సభకు వస్తారు. అసెంబ్లీలో ఏ పార్టీ అధికారంలో ఉండి మెజార్టీ వస్తే ఆ పార్టీ వారే చట్టం చేయడం పరమామూలే. అయితే ప్రభుత్వం చేసిన ఆ చట్టాన్ని 'పెద్దలసభకు పంపి ఆమోదించుకోవడం చట్టసభల్లో పొందుపరచిన అంశం,. అలాంటి శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్లకు ఆర్నెల్లకు ముందే అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీ టిడిపిలు హోరాహోరీన పోటీపడి దొంగోట్లు చేర్పించేశారు. ఒకటికాదు, రెండు కాదు ఒకే బూత్‌లో ఒకే పేరుతో 30 ఓట్లు ఉండటం వామపక్షాలకు షాకిచ్చినట్లయ్యింది. పట్టభద్రులు కాని వారు సైతం ప్రైవేట్ కాలేజీల్లో దొంగ డిగ్రీలను సంపాదించి నకిలీ ఓటర్లుగా చేర్పించేశారు. డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి, టీచర్లకే ఓటు హక్కు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సిలకు ఓటు వేయాల్సి ఉంది. అయితే వైఎస్‌ఆర్ కాంగ్రెస్, టిడిపిలు అనుకూలమైన కార్పొరేట్ కాలేజీలు, సచివాలయాలను వేదిక చేసుకుని భారీగా బోగస్ ఓట్లను చేర్పించారు. ప్రజాతంత్రశక్తులు, మేధావులు, వామపక్షాలు ఓటర్ జాబితాలను పరిశీలిస్తే చిత్రవిచిత్రాలు బయటపడ్డాయి. తిరుపతిలో 49 డివిజన్లలో ఒకరి పేరు ఎస్.మస్తాన్‌వల్లి (56) ముస్లిం ఓటరుగా నమోదయ్యారు. ఆయన బయోడేటా పరిశీలిస్తే చెంగారెడ్డి, తండ్రి క్రిష్టారెడ్డిగా ఆధార్‌కార్డులో తేలింది. అదేవిధంగా తిరుపతి 232 పోలింగ్ కేంద్రంలో లక్ష్మీకుమార్‌కు రెండు ఓట్లు ఉన్నాయి. 231 పోలింగ్ కేంద్రంలో 30 ఓట్లు ఒకే వ్యక్తి పేరుతో నమోదయ్యి ఉంది. గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల 112 పోలింగ్ కేంద్రంలో 1946 నుండి 1975 వరకు 30 ఓట్లు జయనగర్‌లో ఉన్న భాస్కర్‌రావు, తండ్రి కుప్పుస్వామినాయుడు పేరుతో ఉంది. ఆయన వయస్సు 70 సంవత్సరాలు. వరుసగా ఎనిమిది పేజీలు ఆయన పేరుతోనే జాబితా ఉండటం గమనార్హం. ఎన్నిసార్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా తొలగించకపోవడం గమనార్హం. సీరియల్ నెంబర్ 105, 270, 359, , 646, 1275, 1362, 1503, 1541, 1583, 1994, 2058 నంబర్లలోనూ ఒక్కో ఓటు నాలుగైదుసార్లు నమోదయ్యింది. 220 పోలింగ్ కేంద్రంలో 21 మంది ఓటర్లకు రెండుసార్లు నమోదయ్యింది. 780 ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి భారీగా అవకతవకలకు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి, డిఐఒ శేఖర్‌పై ఒత్తిడి తెచ్చి ఇంత భారీ స్థాయిలో ఓటర్లను చేర్పారని సిపిఎం, సిపిఐలు ఆరోపిస్తున్నాయి. అధికార పార్టీ టీచర్స్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి తరపున ఇప్పటికే గిఫ్ట్‌ప్యాక్‌లో చేరవేశారని విశ్వసనీయ సమాచారం. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా నిలిచిందని తెలుస్తోంది. సిసి కెమెరాల ఆధారంగా విచారణ జరపాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క తిరుపతిలోనే రెండు మూడు పోలింగ్ కేంద్రాల్లోనే వందలాది బోగస్ ఓట్లు ఉంటే, జిల్లావ్యాప్తంగా ఇంకెన్ని ఉంటాయో ఎన్నికల కమిషన్‌కే తెలియాల్సి ఉంది.



విలేకరుల సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి

నాయుడుపేటలో పేలిన గ్యాస్ పైప్ లైన్

- భయభ్రాంతులకు గురైన స్థానికులు

ప్రజాశక్తి - నాయుడుపేట

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు సమీపంలోని పారిశ్రామికవాడ వద్ద గ్యాస్‌పైప్‌లైన్ పేలుడు కలకలం సృష్టించింది. ఒక్కసారిగా పెద్దశబ్దం పేలడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రయోగాత్మకంగా ఇంటింటికీ గ్యాస్‌ను అందించేందుకు ఆదానీ కంపెనీకి చెందిన ఎజి అండ్ పి అనే కంపెనీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా ట్రయల్ పద్ధతిలో గాలిని పైప్‌లైన్లో నింపుతుండగా ఒత్తిడి తట్టుకోలేని పైపులు ఒక్కసారిగా పగిలాయని చెబుతున్నారు. దీంతో భారీ శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనతో గ్యాస్ పైప్‌లైను ఇక్కడ అమర్చుకుని ఉన్న నాయుడుపేట పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉపయోగంలోకి రాకముందే ఇంతటి ప్రమాదాలు జరిగితే వాడకంలోకి వచ్చాక పరిస్థితి ఎలా ఉంటుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం చొరవతీసుకుని ఈ ప్రక్రియని ఇంతటితో ఆపు చేయాలని, ఇక్కడ అమర్చిన వారి పైపులను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

ఈ ప్రాజెక్టు మొదలు నుంచి కూడా వారు సరియైన పద్ధతి అనుసరించలేదని, మొదట్లో అసలు వివరాలు చెప్పకుండా ఇదేదో ఫ్రీగా ఇచ్చే ప్రభుత్వ ప్రాజెక్టు లాగా తెగ హడావిడి చేసి ఇక్కడ వారి పైపులు అమర్చారని, అమర్చిన తరువాత వివరాలకోసమని ఫోన్ చేసే ఏడు వేల వరకు డబ్బులు చెల్లించాలని చెబుతున్నారని, వీటిపై అధికారులు కానీ, అధికార పార్టీ నాయకులు గాని ఇదొక ప్రయివేటు పాజెక్టు అన్న సమాచారం ఇవ్వక పోవడం శోచనీయమని ఈ ప్రాజెక్టు పేరుతో అంతంతమాత్రంగానే ఉన్న రోడ్లని మరింత గుంతలమయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సిఐ సిహెచ్ ప్రభాకర్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా వార్తల్లో వాస్తవం లేదని, అనవసరంగా అవాస్తవాల ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పైపులను శుభ్రపరిచే ప్రక్రియలో భాగంగా గాలిని నింపుతుండగా పైపులు పగిలాయని తెలిపారు.

డబుల్ ఎంట్రీలను తొలగిస్తాం : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న శాసనమండలి ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని, డబుల్ ఎంట్రీలను తొలగించే చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్, శాసనమండలి ఎన్నికల నిర్వహణాధికారి అనుపమ అంజలి అన్నారు. నగరంలోని పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శనివారం అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ అనుపమ అంజలి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందన్నారు. అందులో భాగంగానే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారన్నారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు తగినన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, వాటిల్లో కొన్నింటికి చిన్న చిన్న మరమ్మత్తులు పూర్తి చేయిస్తున్నామన్నారు. శాసనమండలి ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామని, వారి వద్ద నుండి మరింత సమాచారం తీసుకున్నామన్నారు. ఇప్పటికే 200 డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించామన్నారు. ఈ జాబితాను బి ఎల్ ఓ లకు ఇచ్చి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి తొలగిస్తామన్నారు. కమిషనర్ వెంట ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, డెప్యూటీ తహశీల్దార్ జీవన్ తదితరులు ఉన్నారు.

టర్కీ భూకంప బాధితులను సమిష్టిగా ఆదుకుందాం

- నేడు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టర్కీ సిరియా ప్రాంతాలలో ఎన్నడూ లేని విధంగా భూకంపంతో వేల సంఖ్యలో మరణాలు సంభవించాయని, అక్కడి బాధితులను మానవతా దృక్పథంతో తగిన సహకారాన్ని అందించడానికి ముందుకు రావాలని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగోట్ల పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులతో కలిసి ఆయన మాట్లాడుతూ నాలుగు డిగ్రీల చలి కుప్పకూలిన భవంతుల సెదిలాలను తొలగించడానికి కూడా వీలుకాని పరిస్థితులు టర్కీ సిరియాలలో ఏర్పడ్డాయన్నారు. ప్రకృతి విపత్తుతో అల్లాడిపోతున్న బాధితులను భారత ప్రభుత్వంతో పాటు ప్రపంచ దేశాలు కూడా తనవంతుగా సహాయ సహకారాలను అందిస్తున్నాయన్నారు. భూకంప బాధితులను ఆదుకోవడానికి తిరుపతి నగరంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు కపిల్ తీర్థం రోడ్డులో ఉన్న ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం వద్ద నుండి గాంధీ రోడ్డు నాలుగు కాళ్ల మండపం వరకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, నగర పౌరులతో కలిసి ర్యాలీగా విరాళాలను సేకరించనున్నామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి నగర పౌరులు విరివిగా విరాళాలు అందించి బాధితులకు తాము ఉన్నామని ధైర్యాన్ని చాటే ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు ఐదు లక్షల రూపాయల నగదును విరాళాలుగా సేకరించామని, టర్కీ సిరియా భూకంప బాధితులను ఆదుకోవడానికి మరింత సాయం చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, సహాయ కమిటీ కన్వీనర్ రాజకుమార్, గోవిందధామం కోశాధికారి హేమచంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎంఎం రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ దేవరాజులు, జేసిఐ అధ్యక్షుడు గుణశేఖర్, సోమయ్య, మణికంఠన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బినామీలకు కాంట్రాక్ట్ ఇవ్వడానికే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అధికారికంగా ఆన్లైన్ టెండర్ ద్వారా పనులు దక్కించుకొని 80 శాతం పనులు పూర్తిచేసిన మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుత్తేదారుడు తేజదీప్ ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ వర్సిటీ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో గ్రానైట్ పనులు పెయింటింగ్ పనులు చేయడానికి ఆన్లైన్లో టెండర్లు పిలువగా అధికారికంగా అన్ని నిబంధనలకు లోబడి పనులు చేయడానికి ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ తో ఒప్పందం కుదుర్చుకొని పనులు మొదలు పెట్టామని, కానీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా గుత్తేదారులైన మాచే ఒప్పందంలో లేని పనులు కూడా చేయించుకున్నారని విమర్శించారు. ఒప్పందంలో లేని పనులు కూడా చేయాలని తమపై వర్సిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారని, పనుల నిర్వహణ కోసం తీసుకెళ్లిన కూలీలను సైతం వర్సిటీ ప్రాంగణం నుండి గెంటి వేయడం జరుగుతుందన్నారు. 90 రోజులలో చేయవలసిన పనులను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని, వర్సిటీ అధికారుల తీరుతో మేము కాంట్రాక్టును విడిచి వెళ్లిపోతే వారి అనుయాయులకు కాంట్రాక్టు కట్టబెట్టడానికి వర్సిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రణాళికలు వేశారని ఆరోపించారు. తమ కాంట్రాక్టు పనులు వద్దు అనుకుంటే మేము చేస్తున్న కాంట్రాక్టు కోసం చేసిన డిపాజిట్ నగదు, ఈ పనిలో నష్టాన్ని మొత్తం వర్సిటీ అధికారులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్సిటీ అధికారులు చెప్పిన ఒప్పందంలో లేని పనులు చేసి నష్టపోయామని, ఉన్నతాధికారులు స్పందించి నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జయన్న, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

'యువగళం' పరుగులు

కార్యకర్తల్లో 'రన్నింగ్‌రేస్' ఉత్తేజం

ప్రజాశక్తి - ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం

పాదయాత్ర పరుగులు తీస్తోంది.. నిన్నమొన్నటివరకూ 'యువగళం' పాదయాత్ర అడుగులో అడుగు వేస్తూ సాగింది. ఎస్‌ఆర్‌పురం మండలంలో సాగుతున్న యువగళం పాదయాత్రలో శనివారం నారా లోకేష్ పిల్లారికుప్పం సమీపంలో వడివడి అడుగులు వేస్తూ ఒక్కసారిగా వేగం అందుకున్నారు. రన్నింగ్‌రేస్ చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఒక్కసారిగా కార్యకర్తలందరూ 'పరుగు' ప్రారంభించారు. పొలాల వద్ద నాట్లు వేసే మహిళలతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా బీసీలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ జగన్ హయాంలో యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేవన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్నపుడు 40వేల పరిశ్రమలను తెచ్చి, ఆరు లక్షల ఉద్యోగాలిచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు సిఎంగా ఉన్నపుడు 300 కోట్లు కేటాయించి ఖర్చు చేశారన్నారు. బీసీలకు ఆర్థిక స్వాతంత్ర్యం టిడిపితోనే సాధ్యమన్నారు. లక్షలు లక్షలు పోసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే జగన్ వచ్చాక ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి, కానిస్టేబుల్ పోస్టులు ఇస్తానని మాట తప్పాడన్నారు. మెగా డిఎస్‌సి ఊసే లేదన్నారు. పాఠశాలల్ని మూసేసే పరిస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. తమ హయాంలో బీసీలకు పెద్దపీట వేశామని, యనమల రామకృష్ణుడు చంద్రబాబు పక్కనే కూర్చుంటారన్నారు. అయితే మంత్రి నారాయణస్వామికి జగన్ పెన్ను, కాగితం ఇచ్చి రాసేఅధికారం ఇవ్వలేదన్నారు. చంద్రబాబు వల్ల కుప్పంలో మూడు లక్షల లీటర్ల పాల దిగుబడి వస్తోందన్నారు. బీసీ మంత్రి మౌనం ఎందుకు పాటిస్తున్నారో అర్థం కావడం లేదని, బీసీలకు ఎంత ఖర్చు చేశారో డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. హనుమాన్ దేవాలయంలో యాదవులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు ఎం.రవి యాదవ్ మాట్లాడుతూ బీసీల్లో యాదవ కులస్తులతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపిస్తామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమినేని చిట్టిబాబునాయుడు హామీ ఇచ్చారు. చెంగల్రాయల్ యాదవ్, శ్రీధర్‌వర్మ, సోమవేఖర్ యాదవ్ పాల్గొన్నారు.



యువగళం' పాదయాత్రకు అనుమతి ఇవ్వండి



'ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్ర ఈనెల 21న తిరుపతికి చేరుకుంటుంది. తిరుపతిలో నిర్వహించే పాదయాత్రకు పోలీసులు అనుమతులు ఇవ్వాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ టిడిపి పార్లమెంటు తిరుపతి అధ్యక్షులు నరసింహ యాదవ్ శనివారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడమే కాకుండా రూట్ మ్యాప్‌ను అందజేశారు. లోకేష్ పాదయాత్రకు పోలీసులు ఎటువంటి అడ్డంకులు చెప్పవద్దని, సానుకూలంగా అనుమతులు ఇవ్వాలని కోరారు. పాదయాత్రకు పోలీసులు సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు చినబాబు, కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు పూకా విజయ్ కుమార్, టిడిపి కార్పోరేటర్ ఆర్సి మునికృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు సూర సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్లు జేసీబీతో కూల్చివేత

ముందస్తు సమాచారం లేకనే...

- బిక్కుబిక్కుమంటూ పిల్లల బిత్తరచూపులు
- విద్యుత్‌లైన్లు అప్పటికప్పుడే తొలగింపు
- పుంగనూరులో మున్సిపల్ అధికారుల దుశ్చర్య

ప్రజాశక్తి - పుంగనూరు (చిత్తూరు జిల్లా)

'అమ్మ మన ఇల్లు జేసీబీతో తోసేస్తున్నారు.. ఇక్కడ నాన్న కూడా లేడు' అని ఇద్దరు చిన్నారులు బోరున విలపిస్తూ జీవనం కోసం బయటకు వెళ్లిన తల్లికి చెబుతుండడం పలువురు కంటతడిపెట్టారు. 'మా ఇంటి వద్ద ఎవరూ లేరని, ఉన్నపళంగా మా ఇంటిని కూల్చివేస్తే మేము ఎక్కడికి వెళ్లాలి' అంటూ చిన్నపిల్లలు అధికారుల కాళ్లపై పడి వేడుకున్నా కనికరించకపోవడం అందరి మనస్సు కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.

చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం నానాసాబ్‌పేటలో ఉన్న దాదాపు 20 పేదల ఇళ్లను మున్సిపల్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా శనివారం ఉదయమే జేసీబీలతో కూల్చివేశారు. పోలీసులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ దుశ్చర్య సాగింది. తల్లిదండ్రులు ఇళ్లల్లో లేని పిల్లలు బిత్తరచూపులు చూస్తూ ఎక్కిళ్లు పెడుతూ ఏడుపు లంఖించుకోవడం కనిపించింది. ఇంట్లో సామాన్లను మున్సిపాలిటీ వారే తీసి బయట పెడుతూ, ఉన్నపళంగా ఇళ్లను కూల్చేశారు. విద్యుత్‌లైన్లను సైతం అప్పటికప్పుడే తొలగించారు. ఈ ఘటనను టిడిపి, వామపక్షాలు ఖండించాయి. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి, అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. మహిళలు మున్సిపల్ అధికారులపై, అధికార పార్టీ నాయకులపై శాపనార్థాలు పెడుతూ రోదించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, రూరల్ సిఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లు కూల్చే కార్యక్రమం జరిగింది. ముందస్తు నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతుండగా, పేదలు మాత్రం తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదని వాపోతున్నారు. కనీస సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేయడంతో వృద్ధ మహిళలు బోరున విలపించారు. తరతరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇపుడు అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని బాధితులు మండిపడుతున్నారు. ప్రత్యామ్నాయం చూసుకునే సమయం కూడా లేకుండా వీధిన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను వివరణ కోరగా ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది.

పార్కు అభివృద్ధికి ఆక్రమణ తొలగింపు : అలీమ్‌బాష, మున్సిపల్ ఛైర్మన్

పుంగమ్మ చెరువు కట్టను పార్కుంగా అభివృద్ధి చేసేందుకే ఇళ్లను తొలగించాం. కట్ట ప్రాంతంలో ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. వారందరికీ ప్రత్యామ్నాయంగా తాత్కాలికంగా జెఎండి కల్యాణ మండపంలో వసతి సౌకర్యం కల్పించాం. భోజన సౌకర్యం ఏర్పాటు చేశాం. ఇళ్లు కోల్పోయిన అందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

ఉన్నపళంగా కూల్చేయడం దారుణం : వి.గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

పుంగనూరు పట్టణంలో ఉన్నపళంగా 20 మంది పేదల ఇళ్లు కూల్చేయడం దారుణం. వారికి ప్రత్యామ్నాయం కల్పించి ఖాళీ చేయించి ఉంటే బాగుండేది. జేసీబీలను తీసుకొచ్చి పేదలను వీధినపడేశారు. అప్పటికప్పుడే విద్యుత్ లైన్లను కట్ చేసి మీటర్లను తొలగించారు. ఏదైనా అభివృద్ధి చేయాలనుకుంటే ఆ ప్రాంతంలో ఉండే ప్రజలకు ముందుగా తెలియజేసి, ప్రత్యామ్నాయం ఏర్పాటుచేసిన తరువాత తొలగించాలే తప్ప, దౌర్జన్యం చేయడం ఏంటి?

డిఓఎస్ కాలనీలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట పట్టణం లోని ఇస్రో ఉద్యోగులు నివాసం ఉండే డి ఓ ఎస్ కాలనీలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంను డిప్యూటీ డైరెక్టర్ సేంథిల్ కుమార్ ప్రారంభించారు.కాలనీ లో స్వచ్ఛభారత్ ర్యాలీ చేస్తూ చిన్నారులు, పెద్దలు అందరు కలిసి రోడ్ పక్కన పడి ఉన్న చెత్తను, ప్లాస్టిక్ కవర్లను సేకరించి ఒకేచోటకు చేర్చారు. దీంతో కాలనీ అంతా పరిశుభ్రంగా మారిపోయింది. వాల్ఫ్ జనరల్ మేనేజర్ లవిశెట్టి శ్రీనివాసులు చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించి సత్కరించారు. అలాగే స్వచ్ఛభారత్ డ్రాయింగ్ పోటీలో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ లీలేష్ కుమార్ గౌర్, డి ఓ ఎస్ కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి వేణుగోపాల్,క్రీడా కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, సాంస్కృతిక విభాగ కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు...

మినిమం టైం స్కేల్ ఇవ్వాలి



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి ప్రభుత్వాన్ని ప్రకటనలో డిమాండ్ చేశారు.రాష్ట్ర మంత్రివర్గం కేజీబీవీ ఉపాధ్యాయులకు 23 శాతం జీతాలు పెంచుతున్నట్లు నిర్ణయించారని అధికారులు ప్రకటించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు 2016 నుండి ఇప్పటివరకు జీతాలు పెంచలేదని, మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ గత ఆరేళ్లుగా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచామని చెప్పడం సరైనది కాదన్నారు. కొత్త పిఆర్సీ ప్రకారం 54,060 రూపాయలు మినిమం టైమ్స్ స్కేల్ రావాల్సిన హెడ్మాస్టర్లకు కొత్తగా పెంచినది 34,139 రూపాయలు మాత్రమే వస్తోంది. అంటే ఒక్కొక్కరు నెలకు 19921రూ నష్టపోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు మినిమం టైమ్ స్కేల్ 44570 ఇవ్వాల్సి ఉండగా పెరిగిన 23శాతంతో కలిపి 26,759 మాత్రమే ఇస్తున్నారు. హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలి.అలాగే బాలికల పాఠశాల అయినందున తగిన రక్షణ కోసం వార్డెన్ ని ప్రత్యేకంగా నియమించాలి.ఇప్పుడు ప్రిన్సిపాల్ లేదా టీచర్లే రాత్రులు పిల్లలతో సహా అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డెన్ నియామకం చేపట్టి ఉపాధ్యాయులకు ఆభారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

బాల్యవివాహాల నివారణపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- తిరుపతి సిటి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన గురు విద్యాలయం పాఠశాలలో (అన్నా విద్యాలయ) బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి ,పరివర్తన సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బాల్య వివాహాల నిరోధక చట్టం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా కన్వీనర్ చందమామల కోటయ్య, యానాది ఎంప్లాయిస్ అసోసియేషన్ కో కన్వీనర్ ఎస్. రామయ్య విచ్చేసి మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాల పూర్తి అయినటువంటి బాలికలకు మాత్రమే పెళ్లి చేయవచ్చునని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీ కాళహస్తిలో దేవుని పెళ్లి రోజు శ్రీకాళహస్తి,తిరుపతి, నగిరి,నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాలకు చెందినటువంటి గిరిజన, దళిత బాలికలకు 18 సంవత్సరాలు పూర్తి కాకుండానే పాఠశాలలు మాన్పించి పెళ్లిళ్లు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి వారిని గుర్తించి ముందస్తు అవగాహనలో భాగంగా గ్రామాలలో కాలనీలలో ర్యాలీలు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తతమైన ప్రచారాన్ని కల్పిస్తున్నామని తెలియజేశారు.

అభివృద్ధిపై విమర్శలను మానుకోండి : వైసిపి


మాట్లాడుతున్న మునిశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడిచిన సంవత్సరాలుగా తిరుపతి పట్టణాన్ని అభివద్ధి చేయాలని ఏనాడూ కాంక్షించని తెలుగుదేశం పార్టీ నాయకులు నేడు స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా అభివద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే వాటిపై టిడిపి నాయకులు విమర్శలు చేయడం, నిందలు మోపడం సరైనది కాదని వైసీపీ నేత దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించి పురప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించడానికి మాస్టర్ ప్లాన్ ను అమలు చేస్తున్నామని, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం అభివద్ధి చేయడానికి కత నిశ్చయంతో ఆలయంకు వెళ్లే మార్గంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మిస్తుంటే కక్ష సాధింపులని పత్రికా ప్రకటనలను విడుదల చేయడం తగదన్నారు. గత పది ఏళ్లుగా అధికారంలో ఉండి కూడా తిరుపతి పట్టణాన్ని ఏమాత్రం అభివద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేడు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో కోట్ల రూపాయలు వెచ్చించి అభివద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, ఉద్దేశపూర్వకంగా రాజకీయ కక్షలను లేవనెత్తాలని ప్రజల దష్టి మరల్చడానికి టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అభివద్ధి కార్యక్రమాలు పూర్తవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని చేస్తున్న ప్రచారం అవాస్తవమని ఆధారాలతో సహా నిరూపించాలని డిమాండ్ చేశారు. 11 మాస్టర్ ప్లాన్ రోడ్లను తీసుకువచ్చి తిరుపతిని ఆధ్యాత్మికంగానే కాకుండా సుందర నగరంగా తీర్చిదిద్దడానికి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి కంకణ బద్ధులై ఉన్నారన్నారు. అభివద్ధికి సహకరించాల్సింది పోయి నిరాధార నిందలను మోపుతున్నారన్నారు. రాజేంద్ర నాయుడు అనే వ్యక్తి నగరపాలక సంస్థకు 40 లక్షలు బకాయి ఉన్నారని బకాయి వసూలు అడిగితే కక్ష సాధింపులుగా చిత్రీకరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి విమర్శలను మరొకసారి చేస్తే చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భరణి యాదవ్, తులసి యాదవ్, దొడ్డారెడ్డి మురళి రెడ్డి, బుల్లి, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



ప్రజాశక్తి- పిచ్చాటూరు: నింద్ర సచివాలయం కన్వీనర్ చార్లీ చెల్లెలు భాను భర్త ధర్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శనివారం నారాయణవనం మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడలోని ధర్మ స్వగృహానికి మంత్రి ఆర్కే రోజా చేరుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామలాల్, సంపంత్, మోతిలాల్, చార్లీ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి తల్లి గతనెల 30వ తేదీన అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శనివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం




ప్రజాశక్తి-నాగలాపురం: సురుటుపల్లిలోని శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోవాలను శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉభయదారులుగా మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, విష్ణు కుమారి దంపతులు, కందేరి కళ్యాణ్ చక్రవర్తి, నమ్రత దంపతులు వ్యవహరించారు. సాయంత్రం శ్రీ వాల్మీకేశ్వరునికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈవో రామచంద్రారెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు కొత్తకండ్రిగలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ(జ్ఞానాంబకండ్రిగ) గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజీఎం హాస్పిటల్స్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నాయి. గుండె ఎముకలు, చిన్నపిల్లలు, సాధారణ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్లు శిబిరంలో పాల్గొని వైద్య సేవలందిస్తారు. వైద్య శిబిరాన్ని కొత్తకండ్రిగ, జ్ఞానాంబ కండ్రిగ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ పిలుపునిచ్చింది.

ఎన్నికల నియమావళి పాటించాలి



ప్రజాశక్తి-పిచ్చాటూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున నియమావళిని తప్పక పాటించాలని.. ఈనెల 9 నుంచి మార్చి 30 వరకు ఎన్నికల కోడ్ ఉందని తహశీల్దార్ మధుసూదన్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో అఖిల పక్షం నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు ఎంపీపీ పాఠశాల ఆవరణలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని..పట్టభద్రుల ఓటర్లు 685, ఉపాధ్యాయులు 16 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటరుగా నమోదు మార్చి 13 వరకు ఆవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు హరిశ్చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, డీటీ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, వీఆర్వో ప్రియాంక, సెల్వం, రూపేష్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో అఖిలపక్షం నాయకులతో శనివారం డిప్యూటీ తహశీల్దార్ శివయ్య స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో 2 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు విద్యానాథ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గురునాథం, మునిరాజా, టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, బీజేపీ అధ్యక్షులు హరిబాబురెడ్డి, సీపీఎం కార్యదర్శి రమణయ్య, సీపీఐ చంద్రమ్మ, జనసేన పార్టీ బాషా, అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో సురేష్ బాబు, ఎస్సై కష్ణారెడ్డిల ఆధ్వర్యంలో శనివారం అఖిల పక్షం నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిపై సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా, ఏఎంసీ డైరెక్టర్ కష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, రఘునాయుడు, బీజేపీ మండల ప్రెసిడెంట్ మురళి, వైసీపీ నాయకుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే వేటు తప్పదని తహశీల్దారు పూజారి శ్రీనివాసులు అన్నారు. శనివారం తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల కోడ్‌పై అన్ని పార్టీల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఎక్కడైనా ప్రచారాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ అజ్మీత్తుల్లఖాన్, ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: తిరుపతిలోని కృషి విజ్ఞాన కేంద్రం భారతీయ వ్యవసాయ నైపుణ్య శిక్షణ మండలి సహకారంతో స్వయం ఉపాధి కోసం 25 రోజుల నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త,. హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల కలిగిన యువతకు పెరటి కోళ్ల పెంపకం,సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు, పుట్టగొడుగుల పెంపకంపై 25 రోజులు శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తున్నారని, శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 9121968292, 9908836684, 8074006322 లను సంప్రదించాలని కోరారు. తెలిపారు.


టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా రజిత

ప్రజాశక్తి-కేవీబీపురం: టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, లోకేష్, అచ్చెమనాయుడు ఆదేశాల మేరకు తిరుపతి మహిళా కమిటీని నియమించారు. ఈ సందర్భంగా కలత్తూరు పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ రజితను తిరుపతి పార్లమెంట్ టీడీపీ మహిళ ఉపాధ్యక్షురాలుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు అందించారు. మండలంలోని పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

మంచి అలవాట్లతోనే ఆరోగ్యం

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి





ప్రజాశక్తి- క్యాంపస్: జీవన విధానంలో ఎదురయ్యే ఆరోగ్య ఇబ్బందులను గుర్తించి వాటిపై అవగాహన కల్పించుకుంటేనే జబ్బుల నుంచి రక్షణ కల్పించుకోవచ్చని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శ్వేత ఆధ్వర్యంలో టీటీడీ పురుష ఉద్యోగులకు మూడు రోజుల పాటు నిర్వహించే జీవనశైలి రుగ్మతలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం మహతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ స్థూలకాయంతో షుగర్, గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. రోజుకు 8 గంటల నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, ధ్యానంలాంటి అలవాట్లతో వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థకు మంచి సేవలు అందించగల్గుతారని చెప్పారు. ఉద్యోగులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. జబ్బుల లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. శ్వేత ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జేఈవో శ్వేత డైరెక్టర్‌ను అభినందించారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు అనేక వ్యాధులతో బాధ పడుతున్నారని.. వ్యాధులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ 15 సంవత్సరాల వయసు దాటినప్పటి నుండే వ్యాధులపై అవగాహన కల్పించుకోవాల్సి ఉందన్నారు. మంచి నిద్ర, ఆహారం, వ్యాయామంతో అనేక వ్యాధులను దూరంగా ఉంచుకోవచ్చన్నారు. గురక కారణంగా గుండె, మెదడుకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. వీటిపై అవగాహన కల్పించుకుని ఆచరిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి మాట్లాడుతూ ముందు జాగ్రత్త, సరైన సమయంలో చికిత్స తీసుకోవడంతో అనారోగ్యం బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి శ్వేత కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం జీవన శైలి రుగ్మతలపై ముద్రించిన పాకెట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అత్యధిక షుగర్ లెవల్స్ తో బాధపడుతున్న ఉద్యోగులకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం..!



ప్రజాశక్తి- క్యాంపస్: రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుదామని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం తుమ్మలగుంట పంచాయతీలో ఘనంగా మహా పాదయాత్రను ప్రారంభించారు. గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంచాయతీలో గడప గడపకు మహాపాదయాత్ర కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి దొడ్ల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ మోహిత్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మోహిత్ రెడ్డి యువజన విభాగం రక్తదానం చేశారు. దాదాపు 20 యూనిట్లు రక్తం సేకరించారు. ఎంపీపీ మోహిత్ రెడ్డికి సర్పంచ్ నల్లందుల సుబ్బిరామి రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, వైస్ సర్పంచ్ బిరుదాల గోపాల్ రెడ్డి, చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఉప్పరపల్లిలో పర్యటించారు. తుమ్మలగుంట పంచాయతీలో రూ.6.31 కోట్లతో అభివద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పార్లపల్లి దామోదర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చెంచు మోహన్ యాదవ్, పంచాయతీ వార్డు సభ్యులు రాము, చెవిరెడ్డి రేవతి, అరుణ్, చెంచు రామయ్య, ప్రకాష్ రెడ్డి, గ్రామ పెద్దలు తంబి రెడ్డి, మట్టా మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు చెవిరెడ్డి రామచంద్రా రెడ్డి, చెవిరెడ్డి జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు, భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని, అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని గతంలో పలుమార్లు అధికారులు, ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకో లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుందామన్నారు. వ్యవసాయ కార్మిక కూలీ సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జి రాజగోపాల్, వెంకటగిరి సీఐటీయు నాయకులు మస్తానయ్య, సెక్రటరీ మంజులమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సుమతి, మధ్యాహ్న భోజనం కార్మికురాలు పోలమ్మ, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు తక్కువ వడ్డీతో రుణాలివ్వాలి



ప్రజాశక్తి-గూడూరు : ఆటో కార్మికులకు తక్కువ వడ్డీతో రుణాలివ్వాలని తిరుపతి జిల్లా సీఐటీయూ నాయకులు బి.వి. రమణయ్య అన్నారు. శనివారం స్థానిక సి.ఐ.టి.యు కార్యాలయంలో ఆటో కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఎస్సీ, ఎస్టీ, బీ.సీ, కార్పొరేషన్లలో, స్థానిక బ్యాంకులలో అతి తక్కువ వడ్డీతో వాయిదాల పద్ధతిలో, ఆటోలకు రుణ సదుపాయంతో ఇప్పించాలని అధికారులను కోరారు. దీర్ఘకాలికంగా ఫైనాన్స్ వాళ్ల చేతుల్లో ఎక్కువగా ఆటో కార్మికులు మోసపోతున్నారని నెలసరి వాయిదాలు కట్టినా ఆఖరికి ఆటో కార్మికులు ఫైనాన్స్ వారి చేతుల్లో మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం వారికి భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కె.వి.పి.ఎస్.నాయకులు అడపాల ప్రసాద్, సి.పి.ఎం. సెంటర్ శాఖ సభ్యులు మణి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

సీఐటీయూ సర్వసభ్య సమావేశం అనంతరం ఎస్కే కాలేషా, అధ్యక్షులుగా వి. కోటయ్య, సహాయ అధ్యక్షులుగా సి.హెచ్.పోలయ్య, కార్యదర్శిగా ఎస్కే. ఇబ్రహీం, సహాయ కార్యదర్శిగా ట్రెజరర్ వెంకయ్య, కమిటీ మెంబర్లుగా వినోద్, కుమార్, వెంకటేష్, చిన్న చెంచయ్య తదితరులను ఎన్నుకున్నారు.

రాజీ మార్గమే.. రాజమార్గం..!





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సుమారు 600 పైగా కేసులకు సత్వర పరిష్కారం లభించింది. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి సమక్షంలో కక్షిదారుల మధ్య ఉన్న దీర్ఘకాలిక కేసులకు అక్కడికక్కడే పరిష్కారం చూపడం గమనార్హం. ఇందులో 22 సివిల్ కేసులు, 450 క్రిమినల్ కేసులు, 41 బ్యాంకు కేసులను పరిష్కరించి రూ. కోటికి పైగా పైకాన్ని రికవరీ చేసినట్లు న్యాయమూర్తులు తెలిపారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: రాజీమార్గమే రాజమార్గమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. పుత్తూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం కోసమే ప్రభుత్వం లోక్ అదాలత్ ఏర్పాటు చేశారని.. కేసులను పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి లీలా శ్యాంసుందరి, అదనపు జడ్జి గోపాలకృష్ణ, న్యాయవాదుల సంఘ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, మురుగేషన్‌రెడ్డి, సంజీవి, పురుషోత్తం, న్యాయవాదులు, కక్షదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుపై కక్ష సాధింపు అప్రజాస్వామికం



ప్రజాశక్తి-తొట్టంబేడు: వడ్డీ డబ్బులు ఇవ్వలేదనే నెపంతో రైతుపై కక్షతో చేతికొచ్చిన పంటను నాశనం చేయడం అప్రజాస్వామిక చర్యని నియోజకవర్గ సీపీఎం పరిశీలకులు అంగేరి పుల్లయ్య అన్నారు. మండలంలోని చిట్టత్తూరులో ధ్వంసమైన మురళీకష్ణారెడ్డి వేరుశనగ పంటను శనివారం సిపిఎం నాయకులు పరిశీలించారు. సారవంతమైన భూమిలో ప్రకతి వ్యవసాయం చేస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతు మురళీకష్ణారెడ్డికి అండగా నిలవాల్సింది పోయి దాడి చేయడం సహేతుకం కాదన్నారు. వైసీపీకి చెందిన ఓ వ్యక్తి ఈ భూమిపై కన్నేసి సొంతం చేసుకోవడానికి కుట్రలు చేయడం దారుణమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ అధికారుల అండంతో రికార్డులను తారుమారు చేసి, ఆపై రైతులను ఇబ్బంది పెట్టే ఘటనలు కోకొల్లలు జరిగాయని వాపోయారు. ఇలాంటి కుట్రలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

మూడు గంటల్లోపే పాప ఆచూకీ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్‌లో ఏఆర్.కానిస్టేబుల్ తొమ్మిది సంవత్సరాల పాప శుక్రవారం స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తరువాత సాయంత్రం సుమారు 4.15గంటలకు కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుండి బెంగళూరులో పిన్ని వాళ్ళ ఇంటికి వెళుతున్నట్లు లెటర్ రాసి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న పాప తండ్రి వెంటనే ఆర్ఐ ఎంటిఒ మధుకి తమ తొమ్మిదేళ్ల పాప కనిపించడం లేదని సమాచారం అందించారు. ఆర్ఐ ఎంటిఒ జిల్లా ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డికి సమాచారాన్ని అందించి ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఎంటిఒ మధు పాప ఎటువెళ్లిందనే దాని పై సిసి కెమెరా ఫూటేజ్ కోసం చిత్తూరు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు విషయం తెలిపి మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ సిబ్బందిని అలర్ట్ చేసి రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, చిత్తూరులోని పలు ప్రాంతాలలో వెతకటానికి బందాలుగా పంపి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సిసి టివి ఫూటేజ్ పరిశీలించారు. పాప సుమారు 4.20 గంటల సమయంలో ఎంఎస్ఆర్ నుండి పలమనేరు బస్టాప్ వైపు వెళ్లినట్టు రికార్డు అయింది. అనంతరం ఆర్టీసీ ఎంక్వయిరీకి వెళ్లి వారి దగ్గర నుండి సాయంత్రం 4.15 గంటల నుండి చిత్తూరు - బెంగుళూరుకు వెళ్లిన బస్సుల డ్రైవర్ మరియు కండక్టర్ల ఫోన్‌నెంబర్‌లు తీసుకొని ఒక్కో బస్సు డ్రైవర్‌కి కాల్ చేసి ఎవరైనా పాప సింగల్‌గా ఉన్నదా అని అడిగి తెలుసుకోవడం ప్రారంభించారు. సుమారు 4.40 గంటలకు పాప బెంగుళూరు బస్సు ఎక్కినట్టు ఒక డ్రైవర్ నిర్ధారించారు. అనంతరం డ్రైవర్ పాపను ఫోటో తీసి పంపి ఆ పాపే అని నిర్ధారించుకొని విషయం వారి తల్లిదండ్రులకు తెలిపి కెఆర్.పురంలో పాపని చిత్తూరు పోలీసుల మిత్రులకు అప్పగించారు. చిత్తూరు నుంచి పోలీసు వారు వెళ్లి పాపను సురక్షితంగా చిత్తూరుకు తీసుకొని వచ్చి వారి తల్లితండ్రులకు అప్పగించడం జరిగింది. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ పి.జగదీష్, తప్పిపోయిన పోలీసు కానిస్టేబుల్, పాపకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సకాలంలో స్పందించి పాప ఆచూకి కనిపెట్టి పాప తప్పిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పజెప్పిన ఆర్ఐ. ఎంటిఒ మధు, సిబ్బంది సురేంద్ర, కుమార్, పృథ్వికి జిల్లా ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డ్ అందజేశారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి - నగరి: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై దళిత సంఘాలు మండిపడ్డాయి. శనివారం నగరి అంబేద్కర్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగ నిర్మాత పై వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను మరియు మనుశాస్త్రధర్మ ప్రతులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బోకం రమేష్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ఏర్పాటు అయినప్పటి నుంచి దళితులకు మాత్రమే కాదు రాజ్యాంగం మీద కూడా దాడులు పెరిగిపోయాయని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరాణికం మీద ఉందని, చిన్న చిన్న నాయకులు బీజేపీ మెప్పు పొందడం కోసం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజ్యాంగాన్ని సవరించాలంటూ ప్రపంచ మేధావి అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయడమే ధ్యేయంగా పెట్టుకొని నడుస్తున్నారన్నారు. అలాంటి వారిని వెనుక నుండి ఆర్ఎస్ఎస్, సంపరివార్, బజరంగ్దళ్ వంటి ఉగ్రమూక శక్తులు నడిపిస్తున్నారన్నారు. వ్యాఖ్యలు చేసే వారు తీవ్ర పరిణామాలు చవి చూడాల్సి ఉంటుందనే విషయాన్ని మర్చిపోకూడదని హితవు పలికారు. హమారా ప్రసాద్‌పై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద కేసు అరెస్ట్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున దళిత సంఘాలను కలుపుకొని హమారా చలో హమారా ప్రసాద్ ఇంటికి పిలుపునివ్వడం జరుగుతుందని హెచ్చరించారు. అంబేద్కర్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోపి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎంకే ప్రకాష్, జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, జిల్లా అధ్యక్షులు వేలాయుధం, మధు బాబు, బహుజన సమాజ్ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి నాగూర్, సీపీఐ వేలన్, కెపిఎస్ నాయకులు తంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎస్ విద్యావతి తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె పంచాయితీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో విద్యావతి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోర్లని గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఉందని తెలిపారు.

జేఏసీ సదస్సును జయప్రదం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతిలోని బైరాగిపట్టెడ గంధమనేని శివయ్య భవన్లో ఈనెల 17న నిర్వహించనున్న దళిత, గిరిజన జేఏసీ రాయలసీమ సదస్సును జయప్రదం చేయాలని దళిత, గిరిజన జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం దళిత గిరిజన జేఏసీ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. దళిత , గిరిజనుల సమస్యలను పరిష్కరానికి జేఏసీ ఏర్పాటు కావడం శుభపరిణామమని నాయకులు తెలిపారు. పాలక ప్రభుత్వాలు మారినా బడుగు, బలహీన వర్గాల్లో అభివద్ధి మాత్రం కనబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . దళిత బహుజన ఫ్రంట్ నాయకులు నత్తం హరిబాబు , తలారి బత్తయ్య, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్, సిపిఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం జన సైనికుల పోరాటం




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ సభ్యత్వాలు తీసుకొని ప్రతి ఒక్కరూ జనం కోసం పోరాడే సైనికులవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా పిలుపునిచ్చారు. పట్టణంలోని కొండమిట్టలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ లక్ష్యాలను, సభ్యత్వం తీసుకుంటే వచ్చే లాభాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివద్ధి పథంలో నడవాలంటే అవినీతి మచ్చలేని పవన్ కళ్యాణ్ అధికారంలోకి రావాలని కోరారు. దండి రాఘవయ్య, గోపి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ప్రజాశక్తి-కోట: కొండమిట్ట ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను శనివారం గూడలి ఉపసర్పంచ్ విజయసారథిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలతో కలిసి భోజనం చేసి మెనూ మేరకే భోజనాలు అందించాలని సూచించారు.

బీఆర్ఎస్ బలోపేతానికి రావెల సేవలు



ప్రజాశక్తి-నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి బలోపేతానికి మాజీ మంత్రి, ఆ పార్టీ నాయకులు రావెల కిషోర్ బాబు సేవలు ఎంతో అవసరమని యువనాయకులు కందాటి రజనీకాంత్ అన్నారు. హైదరాబాద్‌లో రావెల కిషోర్‌బాబు నివాసంలో కందాటి రజనీకాంత్ ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి భారత రాష్ట్ర సమితి ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తోట చంద్రశేఖర్, రావెల కిషోర్ బాబు నాయకత్వంలో బీఆర్ఎస్ బలోపేతం కావడం ఖాయమని తెలిపారు.


నారా లోకేష్ పాదయాత్ర జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జయప్రదం చేయడానికి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ సూచనల మేరకు వినాయకపురం, కళ్యాణపురం, కుందిమాకులకుంట ఎస్టీ కాలనీల్లోని నాయకులతో నాయకులు సమావేశమయ్యారు. పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, పుత్తూరు మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ యుగంధర్, మున్సిపాలిటీ వైస్ మాజీ ఛైర్మన్ ఆనంద్ , పుత్తూరు పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు హేమాద్రి, 12వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగయ్య , 12వ వార్డు ప్రధాన కార్యదర్శి కుమార్ , 12వ వార్డు సీనియర్ నాయకులు గిరి పాల్గొన్నారు.

ఇళ్లల్లోకి విష పాములు

ప్రజాశక్తి-బాలాయపల్లి: పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో దళితవాడ, బీసీ కాలనీలలో విద్యుత్తు దీపాలు లేక రాత్రి వేళల్లో విష పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. మండలంలోని మన్నూరు మిట్ట గ్రామంలో శనివారం రాత్రి ఓ ఇంట్లోకి పాము రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఎస్సీ, బీసీ కాలనీలు అంధకారంలో ఉన్నాయని.. వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సిన పంచాయతీ పాలకులు, అధికారుల దష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి



ప్రజాశక్తి-సత్యవేడు: ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శంగా నిర్వహించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అరుణాచలం, సత్యవేడు సిపిఎం పార్టీ కార్యదర్శి రమేష్ కోరారు. పలు సమస్యలపై తహశీల్దారుకు వినతిపత్రం అందించారు.

రాజకీయ ఫ్లెక్సీలు తొలగించాలి

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల వ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ క్రింద ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని రామకుప్పం మండలపరిషత్ అభివద్ధి అధికారి రాధాకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా పలుచోట్ల ఉన్న అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడలపై ఉన్న రాతలు వెంటనే తొలగించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న తేదీల వరకు ఎలాంటి రాజకీయ సమావేశాలు, ప్రచార సభలు వంటివి నిర్వహించరాదని ఆయన కోరారు.